# తీరం చేరిన కెరటం

విశ్వనాథ గణపతి రావు



**ఫస్టు ఫ్లోర్** బాల్కనీలో కుర్చీ వేసుకుని కూర్చున్నా బృంద కళ్ళు రోడ్డు మీద అటూ, ఇటూ తిరుగుతున్న జనంలో అతని కోసం వెతుకుతున్నయి. ఆమె కళ్ళే కాదు-తనువులో అణువణువూ అతని కోసం, అలవోకగా చూ సే కనీసపు చూపు కోసం నిరీక్షిస్తున్నాయి.

ఆ నిరీక్షణ ఎంత మధురంగా ఉంటుంది?

ఆ నిరీక్షణ లోనే నులివెచ్చని బాధ ఉంటుంది.

ఆ నిరీక్షణలోనే గుబులుగా, పులకింతగా...!

ఎందుకు?

అతణ్ణి చూ స్తే, అతని చూపు సోకితే ఎందుకిన్ని అనుభూతులు కలుగుతున్నాయి!

ఏమో!... ఆమెకు తెలియడం లేదు. ఇంకా ఎదగని మనసు తెలుసుకోలేక పోతూంది. తెలియని మనసు తల్లడిల్లి పోతూంది. తప్పో ఒప్పో తెలియక తపించిపోతూంది. ఆ తపన తీరాలంటే, తన గుండెలో గుబులు పోవాలంటే అతని చూపులు కావాలి. అలవోకగా చూ సే చూపులు కాదు. ఆమె కోసం ఆర్తిగా చూ సే చూపులు. ఆ చూపులతో చుట్టి గాలిలోకి, ఏవో తెలియని సుందర మధుర లోకాలలోకి, ఏవేవో తీరాలలోకి తీసుకుపోవాలి.

అవే, ఆ చూపుల కోసమే!... ఆ చూపు చూడాలనుకునే అతని కోసమే ఆమె కళ్ళు వెతుకుతున్నాయి.

వెతుకుతున్న బృంద కళ్ళకు అతను కనిపించడం లేదు.

కనిపిస్తున్న ఆ జనంలో అతను లేడు. అతని కోసమే బుర్ర ఆలోచించ సాగింది.

అతను ఇంకా ఇంటి దగ్గర నుండి బయలుదేర లే దన్నమాట! అతని ఇల్లెక్కడో?... అతనికి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఉన్నారో, లేరో?

ఉంటే ఉండవచ్చు; లేకపోతే లేకపోవచ్చు. అతని కోసం, అతని బంధువుల కోసం, అతని గుణగణాల కోసం, అతనికి సంబంధించిన ఎటువంటి వివరం కూడా తెలియని తను అతనిని అభిమానించడం, అతని తోడిదే లోకమని ఊహించుకోవడం, అతనే తను-తనే అతనూ!... ఎందు కిలా అయిపోతూంది తన మనసు?


తన మనస్సు కేమయిందని?

ఏమీ కాని అతనిపై అందమైన లతలను అల్లుకుంటూ, రోజులు గడుపుకుంటూ, ఈ బాల్కనీలో నిరీక్షిస్తూ ఎంతకాలం? ఇంకెంత కాలం? ఇలా మరికెంత కాలం?

ఎంతకాల మయింది?

ఒక్క సంవత్సరమేగా?...






సంవత్సరం!

పన్నెండునెలలు...

మూడువందల అరవైఐదు రోజులు...

అబ్బా!... మూడువందల అరవైఐదు యుగాల నుండి నిరీక్షిస్తున్నట్టుగా ఉంది.

ఇన్ని యుగాలు గడిచిపోయినా, అతను తన వైపు ఇప్పటికీ ఒక్కసారి కూడా కనీసం చూడలేదు. చూచి, వలచి, చెంతకు చేరాలంటే... ఇంకెన్ని యుగాలు గడవాలో!

ఎంత ఆశ తనలో ఇమిడి ఉంది? ఆ ఆశ బయట పెడితే ఎద్దేవా చేస్తుందేమో లోకం!

లోకానికేం తెలుసు తన ఈ ఆశకు ముందు తనెంత సంఘర్షణకు లోనయిందో!

ఛీ! ఛీ! ఎంత చెడ్డది లోకం?

లోకం చెడ్డదా? ఏమో, తనకేం తెలుసూ? నూతిలో కప్పలా తనకి ఈ బాల్కానీయే లోకం! ఎదురుగా కనిపించే రోడ్డే మరో లోకం. ఆ మరో లోకంలో ఒక మనిషి పొందును తను కోరుకుంటుందంటే... అది ఎంత సాహసం? ఎంత దురాశ?

అతను... అవును. అతనే! వస్తుంది అతనే!

ఉలిక్కి పడింది బృంద.

బిల్డింగు పక్క వీధిలో నుంచి వచ్చి, ఇటు తిరిగి ప్రహరీగోడ గేటు వరకూ వచ్చి, ఎదురుగా ఉన్న రోడ్డు మీద నుంచి వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

ఆశగా అతనివైపు చూసింది.

'ఒక్కసారి... ఒకే ఒక్కసారి అతను తనవైపు చూస్తే ఎంత బావుణ్ను.' అనుకుంది. 'బజారుకు వెళుతున్నాడు కాబోలు!' అనుకుంది అతని చేతిలో సంచి చూసి.

అతను వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నాడు. వీధి చివరి వరకూ వెళ్ళి రావిచెట్టు దగ్గర మలుపు తిరిగిపోయాడు. అయితే, ఖచ్చితంగా బజారుకే వెళుతున్నాడు.

తిరిగివచ్చినప్పుడైనా... ఒక్కసారి తనవైపు చూస్తే ఈ రోజుకి తన జీవితం ధన్యమయినట్లే!

"అమ్మా, బృందా!"

ఆలోచనలో ఉన్న బృంద ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది.

ప్రేమనిండిన కళ్ళతో చూస్తూ నిలుచుని ఉంది కళ్యాణమ్మ.

ఆమె ఎంత సేపటి నుండి నిలుచుని చూస్తోందోనని కాస్తా కలవర పడింది బృంద. కాని, తల్లి ముఖం నుండి వాత్సల్యం ఉట్టిపడడం చూసి స్థిమిత పడింది.

కూతురికి దగ్గరగా వచ్చి తల నిమిరింది కళ్యాణమ్మ.

"కాస్తా లేచి లోపటికి రా, తల్లీ! తలకి నూనె రాసి జడ వేస్తాను. వాళ్ళొచ్చే టైమయింది" అంది.

'వాళ్ళు!... ఎంతమంది వస్తారు వాళ్ళ లాంటి వాళ్ళు? వాళ్ళులాంటి వాళ్ళు వస్తూనే ఉన్నారు. చూస్తూనే ఉన్నారు. చూసిన వాళ్ళు వెళ్ళి మరొకళ్ళు వచ్చేటట్టు చేస్తున్నారు. చూస్తున్న వాళ్ళ ముందు బొమ్మలా కూర్చుని, అడిగే వాటికి గంగిరెద్దులా తల ఆడిస్తూ ఇంకెంత మంది వాళ్ళలాంటి వాళ్ళ ముందు కూర్చోవాలి?... ఇంతకూ వాళ్ళెవరూ? నంతకు వచ్చే వ్యాపారస్తులూ, కమీషన్ కోసం వచ్చే దళారీలూనూ!... ఛీ!ఛీ! తనిక ఎవరిముందు కూర్చోకూడదు! అవును! ఎవరి ముందూ కూర్చోకూడదు... కాని,ఈ మాట అమ్మతో అంటే... అమ్మ...! పిచ్చి అమ్మ! తన తలమీద నాలుగు అక్షింతలు వేయించడం కోసం ఎంత తహతహ లాడిపోతూంది. ఏమన్నా అంటే 'కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగవమ్మా!" అంటూ పాత చింతకాయ పచ్చడి లాంటి సామెతొకటి చెవుతుంది. నా మనసులో మాటకీ, అమ్మ సామెతకూ ఏ పొంతనా లేకపోయినా చెవుతూనే ఉంటుంది. అందుకే ఇంకేమీ చెప్పకూడదు. తల దువ్వించుకుని, తల వంచుకుని వెళ్ళి కూర్చోవాలి వాళ్ళ ముందు...

"ఏమే! దాన్ని కాస్తా తయారు చేశావా? వాళ్ళొచ్చే టైమయింది?" లోపట్నుంచి తండ్రి వేసిన కేకతో ఆలోచన నుండి బయటపడింది బృంద.

అమ్మో! నాన్నగారూ!... లేచి నిలుచుంది భయంగా.

"రా,అమ్మా! నీకేం భయం లేదు. దగ్గరే నే నుంటానుగా!" తల్లి ప్రతీసారీ వాడే మాటే అది.

ఒక్క అడుగు ముందుకేసి వెనుతిరిగి చూసింది రోడ్డువైపు! జనం తిరుగుతూనే ఉన్నారు- అటూ ఇటూ!

తను లోపటికి వెళ్ళిపోయిన తరవాత అతను వస్తాడేమో? ఈ రోజు కూడా అతని చూపుకి నోచుకోని దురదృష్టవంతురాలే తను!

రోడ్డు మీద కారు హారన్ వినిపించింది.

"అదిగో వాళ్ళు వచ్చేశారు..." గాభరా పడింది కళ్యాణమ్మ.

రావాలి, తనను చూడాలి అని అనుకుంటున్న అతను రాలేదు. రావడం అనవసరం అనుకుంటున్న వాళ్ళు వచ్చేశారు! అనుకుంటూ, నిదానంగా నడుచుకుంటూ డ్రెస్సింగ్ రూములోకి వెళ్ళిపోయింది బృంద.

×× ×× ××

బాల్కనీలో కూర్చున్న బృందకు తండ్రి తల్లితో ఏదో నెంబరు చెప్పడం వినిపించింది. అది లాటరీ లక్కీ నెంబరు కాదు. ఇప్పటికి తనను చూసుకోవడానికి వచ్చిన సంబంధాల సంఖ్య. ఆ సంఖ్య ఎంత పాపం చేసుకుందో తన వల్ల చీవాట్లు తింటూంది అనుకుంది బృంద.

"ఇన్ని సంబంధాలు వచ్చినా ఒక్కటీ కూడా సెటిల్ కాలేదంటే, ఇక ఈ జన్మకి... దానికి పెళ్ళికాదే!..."

"ఊరుకోండి... అది వింటే బాధ పడుతుంది."

పిచ్చితల్లి! తనంటే ఎంత ప్రేమ. ఎంత లాలన. వింటే బాధ పడతానంట. అంత గట్టిగా తిడుతుంటే ఇంకా వినబడకుండా ఉంటుందా? బాధ. ఇంకా ఎందుకు తను బాధ పడుతుంది? బాధపడి, బాధపడి... బాధను జీర్ణింప జేసుకున్న దానిని... ఇంకా ఏమని బాధపడతాను? ఎందుకు బాధపడతాను? అపజయం కలిగినప్పుడు బాధపడడం మనిషి బలహీనత గనుక తనూ కాస్తా బాధపడినా, అతను కనిపించి ఆ బాధను బజారువరకూ తీసుకెళ్ళి వదిలేస్తాడు. అతను చూసే చూపుతో తన మనస్సు ఊహించనంతటి ఊరట పొందుతుంది... ఒక్క క్షణం చూసే ఆ చూపులో ఎంతటి అనురాగం... ఆలోచిస్తున్న బృంద యథాలాపంగా రోడ్డువైపు చూసింది.

ఆశ్చర్యం!...గుండెను పిండేసే ఆశ్చర్యం!...

మదిని కలవరపరిచే కళ్ళముందు వాస్తవం!...

అతను!...

ఔను, అతనే!

అతని ప్రక్కనే... ఆమె...

ఆమె!... ఎవరు ఆమె?

నల్లని చీర, తెల్లని జాకెట్టు... అందానికే అందంలా ఉందామె!

ఎవరూ? తెల్లని తన మనసుపై నల్లని లోతైన తూట్లు పడేలా చేస్తున్న ఆమె ఎవరు?

